


# ఆటోగ్రాఫ్

-అమరజ్యోతి

నా పేరు రాజేశ్వరరావు. నేను ఓ కేంద్రప్రభుత్వ సంస్థలో క్లర్కుగా పనిచేస్తున్నాను. నా భార్య శాంతి, ఇద్దరు పిల్లలు.

నా భార్య పేరుకు తగినట్లుగా ఎప్పుడూ శాంతంగానే ఉంటుంది. నా స్థాయికి తగ్గ కోరికలతో సంతృప్తిగానే ఉంటోంది. రోజూ ఉదయం ఆఫీసు తర్వాత ఇల్లు రొటీన్‌లైఫ్. సినిమాలకు నెలకోసారి పిల్లలతో వెళ్తాం.

వేసవి సెలవుల్లో మాత్రం పిల్లలు వాళ్ల అమ్మమ్మ గారింట్లోనే గడుపుతుంటారు.

పిల్లలు లేనప్పుడు ఇల్లంతా సైలెంట్‌గా ఉంటుందేమో నాలోని రచయిత నిద్దురలేస్తాడు (చిన్నప్పుడు బాగా పుస్తక్క పురుగునులెండి) చిన్నకథలూ, కవితలూ రాస్తుంటాను. పత్రికలలో చదివిన కథలు, శీర్షికలూ బావుంటే అభినందిస్తూ ఉత్తరాలు రాస్తుంటాను. ఈ ఊరు ట్రాన్స్‌ఫరై వచ్చి ఆరునెలలవుతోంది.

ఇక్కడ ఉన్న కవులూ, రచయితలూ సాహిత్యంపై మక్కువ గలవారు. అదేధ్యాసగా ఉన్న వాళ్ళూ కొంతమంది నాకు పరిచయమయ్యారు. ఓ సాహిత్యాభిమాని షాపులో వేమందరం కలుస్తూ సాహిత్యం గూర్చి చర్చించుకుంటుంటాం. సాహిత్యపరంగా ఎక్కడ ఏ సభ జరిగినా, సన్మానం జరిగినా, పుస్తకావిష్కరణ జరిగినా నేను హాజరవుతాను.

గురజాడ వారి కళామందిరంలోనే సాంస్కృతిక సాహితీ కళా సమావేశాలు జరుగుతుంటాయి. ఈ ఊర్లో కళాకారులతో పాటు సాహితీ ప్రముఖులు, కళలకు హారతులు పట్టే కళాభిమానులు, కళలను ప్రోత్సహించే కళాపోషకులు ఎక్కువేనండోయ్. నాకు బాగా కాలక్షేపంగా ఉంది. ప్రముఖ వ్యాపారవర్గాల వారేమో బాగా నిర్వహిస్తుంటారు.

ఈ హాలులో వెంకట్రావనే వ్యక్తి పనిచేస్తుంటాడు. ఏ సభ జరిగినా వారికి కావాల్సినవి సమకూరుస్తుంటాడు. మంచినీళ్లనుంచీ జనరేటర్ వరకూ అతనే చూసుకుంటాడు.

ఏ సభ గానీ, సమావేశం గానీ ప్రారంభం వరకూ అన్నీ అందిస్తాడు. కార్యక్రమం మొదలవగానే కునికిపాట్లు పడుతూ ఉంటాడు.

పెద్ద రచయితలూ, కవులూ, కళాకారులూ హాజరవుతుంటారు. నేను వారి ఆటోగ్రాఫ్‌లు తీసుకుంటుంటాను.

కాలేజీ రోజుల నుంచీ నాకా అలవాటుంది. ఈ చుట్టుప్రక్కల ఊళ్ళనుంచీ వచ్చిన చూసి వెళుతుంటారు.

ఈ వెంకట్రావే ఓ మూల స్టూల్ మీద కునికిపాట్లు పడుతూ ఉంటాడు. చప్పట్లు విన్పిస్తే ఉలిక్కిపడి లేస్తుంటాడు.

మళ్లీ మామూలే. నాకు నవ్వొస్తూ ఉంటుంది. పదవతరగతి వరకూ చదువుకునే ఉంటాడని అనిపిస్తుంది.

గొప్పవారు, పెద్దవారు చెప్పే మాటలూ, సూక్తులు, ఉపన్యాసాలు వింటే మంచి నాలెడ్జి వస్తుంది కదా!

ఇంతమంది ఎందుకు వస్తున్నారనుకుంటున్నాడు అని చిన్నగా కోపం కూడా వచ్చేది.

ఓ రోజు బజార్లో కనబడ్డాడు. "ఏవోయ్ ఎలా ఉన్నావు?" అని మాట కలిపాను.

"నమస్కారం సార్ మీదయ" అన్నాడు.

అప్పుడే నా మనసులోని మాటని బయటపెట్టాను.

సాహిత్యసభలు జరిగే హాలులో నీకు అనవసరంగా ఉద్యోగం ఇచ్చారోయ్ ఇంకెవరన్నా అయితే ఎంతగా ఆనందించి వారి మాటల్లోని సారాన్ని గ్రహించి విజ్ఞానాన్ని సంపాదించుకుని ఉండేవారో అని. దానికతను అదో రకంగా నవ్వాడు.

"అవన్నీ వింటే మాత్రం నాకేం అర్థం అవుతుంది సార్. మీలాంటి పెద్దచదువులు చదివిన వారికి సార్ అవన్నీ" అని వెళ్లిపోయాడు.

ఓ నాలుగునెలలు ఆ హాలు వైపు వెళ్లలేకపోయాను. కంప్యూటర్ ట్రైనింగ్‌కి హైదరాబాద్ వెళ్లాను.

సాహితీ సంస్థ వారు నిర్వహించిన సంతాపసభలో తెలిసింది వెంకటరావు అనారోగ్యంతో చనిపోయాడని. చాలా బాధపడ్డాను.

వెంకటరావు ఎంతటి ఔదార్యం, ఉన్నత వ్యక్తిత్వం గల వ్యక్తో ఇప్పుడే తెలిసింది.

అతని కష్టార్జితంలో లక్షరూపాయలను సాహిత్యాభివృద్ధికి విరాళంగా రాసాడని తెలిసి అవాక్కయ్యాను.

తన అనారోగ్యం గురించి కానీ, విరాళం ఇవ్వనున్న సంగతి కానీ ఎవ్వరికీ చెప్పలేదు. తెలియనివ్వలేదు.

వందరూపాయలు విరాళం ఇస్తే వందసార్లు చెప్పుకునే ఈ రోజుల్లో, పబ్లిసిటీ లేకుండా పైసా ఇవ్వని ఈరోజుల్లో వెంకట్రావులాంటి వ్యక్తి అరుదనే చెప్పాలి.

అతని సంస్కారానికీ, ఔదార్యానికీ మనసులోనే జోహార్లు అర్పించాను.

మనస్సులో అనిపించింది వెంకట్రావు దగ్గర ఆటోగ్రాఫ్ తీసుకుని ఉండాల్సిందని.

★